## క్లుప్తంగా

### పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

పాములపాడు:విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్ కో ఏడీఏ రమేష్‌కుమార్, ఏఈ అబ్దుల్ అబీద్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 13న 33/11కేవీ సబ్‌స్టేషన్ ఏపీఎస్‌డీసీఎల్, శ్రీశైలంలో ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు నిర్వహించనున్నామన్నారు. సమావేశానికి జిల్లా రిటైర్డ్ జడ్జి, విద్యుత్ వినియోగదారుల చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి రానున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కారం కానటువంటి సమస్యలు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు సదస్సుకు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

### భూసారం తగ్గకుండా చూసుకోవాలి

పాములపాడు: భూసారం తగ్గకుండా చూసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి హేమలత అన్నారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో రైతులు సాగు చేసిన పంటలు, దిగుబడి వివరాలపై చర్చించారు. మండలంలో మొక్కజొన్న, జొన్న, మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు. వర్షాలు లేక దిగుబడులు తగ్గాయని, మద్దతు ధర ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు. సమావేశంలో ఏఓ ఫణీశ్వరరెడ్డి, కమిటీ చైర్మన్ రఘురామిరెడ్డి, ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి సహకరించండి

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌ను కర్నూలులో కలిశారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు కర్నూలుకు వెళ్లి టీజీ నివాసంలో ఆయనను కలిసి మహానంది అభివృద్ధిపై చర్చించారు. మహానందిలో కల్యాణ మండపం నిర్మాణానికి సహకరిస్తానని టీజీ వెంకటేష్ హామీ ఇచ్చినట్లు ఈఓ తెలిపారు.

### పీఆర్‌టీయూ ఆవిర్భావదినోత్సవం

జూపాడుబంగ్లా: పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని తంగడంచ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులుడి.జాకీర్‌హుసేన్,హనుమంతరెడ్డి,దేవదానం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తోందన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

### పశుగ్రాసం దగ్ధం

మహానంది: గాజులపల్లెలోని రైతు తిరుపతి రెడ్డికి చెందిన వరిగడ్డి వాము శుక్రవారం దగ్ధమైంది. పాడి పశువుల కోసం గడ్డిని నిల్వ ఉంచుకోగా అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న నంద్యాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు.

### హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువలో పడి వ్యక్తి మృతి


కైపా శ్రీధర్ రెడ్డి (ఫైల్)

కర్నూలు : మిడుతూరు మండలం పీరు సాబ్‌పేట గ్రామానికి చెందిన కైపా శ్రీధర్ రెడ్డి (53) హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువలో శవమై తేలాడు. ఈనెల 7వ తేదీన దిగువపాడు గ్రామ శివారులో ఉన్న హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ గట్టుపైన తన మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసి కనిపించకుండా పోయాడు. శుక్రవారం ఉదయం వెల్దుర్తి మండలం మల్లెంపల్లె వద్ద శవమై తేలాడు. వెల్దుర్తి పోలీసుల సమాచారం మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అక్కడికి చేరుకుని నీటిలో నుంచి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి చనిపోయినట్లు తమ్ముడు వెంకటరామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

### నివాళి

మిడుతూరు: మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన కైపా శ్రీధర్‌రెడ్డి మృతదేహానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దార సుధీర్, పట్టణ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి నివాళులర్పించారు. మృతిచెందిన విషయం తెలుసుకుని పీరుసాహెబ్ పేట గ్రామానికి చేరుకొని శ్రీధర్ రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యులు పర్వత యుగంధర్‌రెడ్డి, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యేలు లబ్బి వెంకటస్వామి, ఐజయ్య, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

# పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ కృషి

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


నగదు ఇస్తున్న ఎమ్మెల్యే శిల్పా


గాజులపల్లెలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా


పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, భువనేశ్వరరెడ్డి

మహానంది: పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఏపీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గాజులపల్లె, ఎం.తిమ్మాపురం, బొల్లవరం గ్రామాల్లో శుక్రవారం రూ.4 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. అనంతరం గాజులపల్లె నుంచి బసాపురం గ్రామానికి వెళ్లేందుకు రూ.2.23 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారి కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చుతుందని ఎమ్మెల్యే శిల్పా అన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, మండల నేత ఒంటెద్దు వీరారెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు, సీనియర్ నేత కొండా మధుసూదన్‌రెడ్డి, తిమ్మాపురం, గాజులపల్లె సర్పంచులు కల్లె శ్రీలక్ష్మి, గడ్డం చంటి, ఎంపీటీసీ పెద్ది స్వరూప పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీలో చేరిక**

ఉల్లిగడ్డల బొల్లవరం గ్రామంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో 30 కుటుంబాలకు చెందిన టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన ఖాదరయ్య, మద్దిలేటి, వెంకటసుబ్బయ్య, చిన్నఖాదరయ్య, నాగేష్, రాముడు, సుబ్బారావులతో పాటు 30 కుటుంబాలు చేరాయి.

**బహుమతుల పంపిణీ**

బండిఆత్మకూరు మండలం లింగాపురంలో సీఎస్ఐ చర్చి మూడవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బలప్రదర్శన మొదటి విజేత ఎడ్ల యజమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.50 వేల నగదు బహుమతి అందించారు. అలాగే బి.కోడూరు అగ్నిప్రమాద బాధిత రైతు మహబూబ్ వలికి రూ.పది వేలు ఆర్థిక సాయం చేశారు.

### బూతులు మాట్లాడే వెధవలకు ఓటుతో బుద్ధి చెప్పండి

మహానంది: బూతులు మాట్లాడే వెధవలకు ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి బూతుల పర్వంపై శిల్పా చక్రపాణి రెడ్డి శుక్రవారం రాత్రి బొల్లవరంలో మాట్లాడారు. ఓటమి భయంతోనే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి బూతుల పర్వం మొదలుపెట్టారన్నారు. ఏ గ్రామంలో సమావేశం జరిగినా అంతు చూస్తానంటున్నారని, నాలుగు రోజులు అతని స్వగ్రామంలో తిరిగినా ఏం చేయలేకపోయారన్నారు.

### శ్రీశైలంలో ప్రసాదంపై అపోహ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భక్తులకు పంపిణీ చేసే ప్రసాదంపై అపోహ చోటుచేసుకుంది. శుక్రవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన భక్తులు శ్రీశైల మల్లన్న దర్శనానికి వచ్చారు. స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న అనంతరం భ్రమరాంబాదేవి అమ్మవారి ఆలయం బయట బ్రహ్మానందరాయగోపురం సమీపంలో పులిహోర ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. దేవస్థానం పంపిణీ చేసిన పులిహోర ప్రసాదంలో మాంసపు అవశేషాలు వచ్చినట్లు భక్తులు గుర్తించి దేవస్థాన పరిపాలన కార్యాలయానికి చేరుకుని ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆలయ అధికారులు పులిహోరలో వచ్చిన వాటిని పరిశీలించి ప్రాథమికంగా దాల్చిన చెక్కగా గుర్తించారు. అలాగే ఈ విషయం తెలుసుకున్న దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పులిహోర ప్రసాదంలో చోటుచేసుకున్న అపోహపై ఆలయ ఏఈవో హరిదాసు, దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్న, వేదపండితుడు ముగ్గురితో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రసాదంలో వచ్చిన పదార్థాన్ని టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపాలని ఈఓ ఆదేశించినట్లు సమాచారం.

### గోరుముద్ద అమలులో నిర్లక్ష్యం తగదు

పగిడ్యాల: జగనన్న గోరు ముద్ద ఆహార పట్టిక మెనూ పట్ల నిర్లక్ష్యం తగదని ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఇండెంట్ పెట్టడంలో హెచ్‌ఎంలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

## జగనన్న ఆరోగ్యసురక్ష పేదలకు వరం


ఓపీ కోసం బారులు తీరిన తంగడంచ గ్రామస్తులు


బీపీ చెక్‌చేస్తున్న వైద్యసిబ్బంది

జూపాడుబంగ్లా: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరమని ఎంపీడీఓ నూర్జహాన్, డాక్టర్ గంగాధర్, ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచ్ ఈశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తంగడంచ గ్రామ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకం బడుగు, బలహీనవర్గాలతో పాటు అన్నివర్గాల ప్రజలు సామాజిక, ఆర్థికంగా రాణించేవిగా ఉన్నాయన్నారు. వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కొందరిని కర్నూల్లోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం అంబమ్మ, సీహెచ్ఓ వహాబ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల తనిఖీ


బోయరేవుల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయకుమారి

వెలుగోడు: మండలంలోని బోయరేవుల గ్రామంలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పి.విజయకుమారి శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడి ఏర్పాట్ల విషయమై సిబ్బందికి సలహాలిచ్చారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని బీఎల్వోలకు సూచించారు. ఆమె వెంట వీఆర్‌ఓ మహబూబ్‌బాషా, జూనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

### విధులపై నిర్లక్ష్యం వహించొద్దు


మిట్టకందాల సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సరస్వతి

పాములపాడు: విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీఓ సరస్వతి సూచించారు. శుక్రవారం ఆమె మిట్టకందాల, మద్దూరు, పాములపాడు-1 సచివాలయాలను పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. మద్దూరులో జగనన్న లేఅవుట్లలో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని, సమస్య జటిలమైనదైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## 15 లోపు ఈకేవైసీ చేయించుకోండి


మాట్లాడుతున్న ఏడీఏ బి.ఆంజనేయ

కొత్తపల్లి: రబీలో సాగు చేసిన పంటల వివరాలను ఈనెల 15 లోపు నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసియన వ్యవసాయసలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీలో జొన్న సాగు చేసిన రైతులు దిగుబడులను దళారులకు అమ్ముకోవద్దని సూచించారు. ప్రభుత్వం పంట నాణ్యత ప్రమాణాలను అనుసరించి మద్దతు ధర రూ.3,180కు కొనుగోలు చేస్తుందన్నారు. పాడి రైతులు, జీవాలు కలిగిన యజమానులు వాటికి ఎటువంటి వ్యాధులు సోకకుండా పశువైద్యశాలకు వచ్చి వ్యాధినిరోధక టీకాలు వేయించాలన్నారు. ఆర్బీకేలలో రికార్డులను సరైన పద్ధతిలో సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి మహేష్, పశువైద్యాధికారిణి భువనేశ్వరి, వ్యవసాయ సలహామండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి


గువ్వలకుంట్ల పోలింగ్ కేంద్ర వద్ద తహసీల్దార్ తిరుపతయ్య

కొత్తపల్లి: జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ తిరుపతయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని ఎదురుపాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11 గ్రామ సచివాలయాలకు గానూ 915 మంది జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఇందులో 385 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పూర్తిచేయడంతో మండలంలో 42 శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. మిగతా వారికి కూడా రెండురోజుల్లో రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. అనంతరం దుద్యాల, కొక్కెరంచ, నాగంపల్లి, ఎదురుపాడు, గోకవరం, జీ.వీరాపురం, పాలెంచెరువు, గువ్వలకుంట్ల, బండి నాయిని పాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతులపై ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వీఆర్వోలు రాజశేఖర్, వేణుగోపాల్, రహీమ్ తదితరులు ఉన్నారు.

### సదస్సును సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: ఈనెల 13న శ్రీశైలంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఏఈ అబీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### విద్యుత్ సరఫరాలో మార్పు

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు, నాగలూటి- పీరుసాహెబ్ పేట పరిధిలోని వ్యవసాయ విద్యుత్ సరఫరాలో శనివారం మార్పులు ఉంటాయని విద్యుత్ ఏఈ క్రాంతికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కడుమూరు విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

## వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి

- నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్


కౌన్సిలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దార సుధీర్

నందికొట్కూరు: సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ సూచించారు. జగనన్న మరోసారి సీఎం కావాలంటూ ఆయన శుక్రవారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రత్యేక పూజల చేశారు. మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం 17వ వార్డులో కౌన్సిలర్ రవూఫ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలను ఆత్మీయంగా పలకరించారు. కాలికి గాయమై ఇబ్బంది పడుతున్న సాయిరాం విద్యాసంస్థల అధినేత సుధాకర్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం దార సుధీర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఆయన అందించిన సంక్షేమ పథకాలే త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో బంఫర్ మెజార్టీని తెచ్చిపెడతాయన్నారు. చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు ఉస్మాన్‌బేగ్, సులోచనమ్మ, తదితరులు ఉన్నారు.

**జగనన్నను మరోసారి సీఎం చేయడమే లక్ష్యం**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర దార సుధీర్ తెలిపారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయం చైర్మన్ చాంబర్‌లో కౌన్సిలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాల అందించడంతో పేదలు సంతృప్తిగా ఉన్నారనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తూ ముందుకు సాగాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారిఫ్, నంద్యాల జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్ సునిత, వైద్యాధికారి గోపాల్, సాజియా, ఎంఈఓ జానకిరామ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

జూపాడుబంగ్లా: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్లు, వెంటిలేటర్, ర్యాంపులు తదితర సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని పారుమంచాల, తంగడంచ, మండ్లెం తదితర గ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈయన వెంట ఆర్ఐ శ్రీరంగారెడ్డి ఉన్నారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

మహానంది: నందిపల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లును శుక్రవారం అరెస్ట్ చేసి అతని నుంచి 31 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

### గొడవలకు దూరంగా ఉండండి

వెలుగోడు: గొడవలకు దూరంగా ఉండాలని ఎస్ఐ భూపాలుడు సూచించారు. శుక్రవారం అయ్యవారిపల్లెలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు.

### కనీస వేతనం ఇవ్వాలి

వెలుగోడు: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి, పదోన్నతి కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు పి.వరలక్ష్మి, పి.స్వర్ణలత, భాగ్యలక్ష్మి, వెంకటరమణమ్మ, షకీరా, మేరీ పాల్గొన్నారు.

### చెంచులు అభివృద్ధి చెందాలి

ఆత్మకూరు: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఐటీడీఏ పీహెచ్ఓ ధనుంజయ చెంచు గిరిజనులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గిరిజనుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ ప్రత్యేక అధికారి నాయక్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, రవీంద్రకుమార్ ప్రసంగించారు.

### క్రీడలతో ఆరోగ్యం

ఆత్మకూరు: పట్టణంలోని జిమ్‌కేంద్రంలో శుక్రవారం క్రీడాకారులకు జిమ్‌కోచింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ శ్యామ్ మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం సాధ్యమన్నారు. అనంతరం క్రీడాకారులు క్రికెట్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

### మద్యం బాటిళ్ల పట్టివేత

వెలుగోడు: మండలంలోని మోతుకూరు గ్రామంలో ఓ వ్యక్తి వద్ద నుంచి 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి 21 మద్యం బాటిళ్ల(180 ఎంఎల్) తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా నిందితుడి పేరు చెప్పేందుకు ఎస్ఐ నిరాకరించారు.

### బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని సూచించారు. శుక్రవారం కోర్టు చాంబర్‌లో స్ట్రీట్ చిల్డ్రన్స్ డే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల కార్మికులను గుర్తించి కుటుంబానికి అప్పగించాలని, బడి బయట ఉండే పిల్లలను బడిలో చేర్పించాలని, అనాథ పిల్లలను చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించాలని ఆమె సూచించారు. మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తునట్లు చెప్పారు.

### ఆధ్యాత్మిక విలువలు అలవరుచుకోవాలి

నందికొట్కూరు: విద్యార్థులు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక విలువలు అలవరుచుకోవాలని చీరాల నారదముని భక్త బృందం ఇస్కాన్ ప్రతినిధి కీర్తి రాజ్ ప్రభు సూచించారు. శుక్రవారం స్కాలర్ స్కూల్‌లో భగవద్గీత ప్రాముఖ్యతను ఆయన విద్యార్థులకు వివరించారు.

## ఘనంగా నులిపురుగుల నివారణ దినోత్సవం

కొత్తపల్లి/వెలుగోడు/పాములపాడు/ నందికొట్కూరు/రూరల్/పగిడ్యాల/ శ్రీశైలంప్రాజెక్ట్: నులిపురుగులు నివారణ దినోత్సవాన్ని నందికొట్కూర్, శ్రీశైలం నియోజకవర్గాల్లో శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు, వైద్యాధికారులు విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. భోజనానికి ముందు, తర్వాత, మల విసర్జన తర్వాత చేతులను సబ్బు తో శుభ్రం చేసుకోవాలని పలువురు విద్యార్థులకు సూచించారు. అపరిశుభ్రంగా ఉన్న చేతులతో ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల కడుపులోకి క్రీములు ప్రవేశించి నులిపురుగులుగా మారి ఎదుగుదలను దెబ్బతీస్తాయన్నారని, రక్తహీనతకు కారణమవుతాయని పలువురు వక్తలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కొత్తపల్లిలో జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా మేనేజర్, నులిపుగుల నివారణ కార్యక్రమం జిల్లా పర్యవేక్షణ అధికారిణి డాక్టర్ సునీత, వైద్యధికారి గోపాల్, వెలుగోడు మండలం వేల్పనూరులో పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం వరలక్ష్మి పాల్గొన్నారు. పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 96.7 శాతం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు డాక్టర్ నాగలక్ష్మి తెలిపారు. నందికొట్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు హెచ్‌ఎం సలీంబాషా అవగాహన కల్పించారు. బ్రాహ్మణకొట్కూరులోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వైద్యురాలు తులసీరాణి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పగిడ్యాల మండలలో 6,258 మంది విద్యార్థులకు మాత్రలు వేశామని వైద్యాధికారి మోహన్ తెలిపారు. శ్రీశైలంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లు పద్మ, సూర్యనారాయణ తెలిపారు.

### జొన్న కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

మహానంది: జొన్న దిగుబడులు విక్రయించుకోవాలనుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని బండిఆత్మకూరు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కృష్ణ మల్లారెడ్డి, మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో వారు మాట్లాడారు.

### బయలు వీరభద్రుడికి పరోక్షసేవలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకుడు బయలువీరభద్రస్వామికి శుక్రవారం అమావాస్య సందర్భంగా భక్తులు పరోక్షసేవను జరిపించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి 21 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా విశేషపూజను జరిపించుకున్నారు.

### పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన

పగిడ్యాల: మండలంలోని పలు గ్రామాల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జీవీ నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల సమయానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని బీఎల్ఓలకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్(సర్వే) మురళీ, సర్వేయర్ శ్రీనువాసులు, వీఆర్వోలు నాగన్న, నరసింహ, మద్దిలేటి, వెంకటస్వామి ఉన్నారు.